క్లుప్తంగా

గోశాలలకు ఫ్యాన్లు వితరణ



ఫ్యాన్లు అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

డోన్ టౌన్: మండలంలోని ఉంగరానిగుండ్ల గ్రామ సమీపంలో ఉన్న వీరానందస్వామి గోశాలకు దాతల ఆర్థిక సహకారంతో స్ఫూర్తి సేవా సంస్థ రూ.16 వేల విలువ చేసే 8 ఫ్యాన్లను అందజేసింది. సంస్థ ప్రతినిధులు శనివారం గోశాల నిర్వాహకుడు వీరానంద స్వామిని కలిసి ఫ్యాన్లు అందజేశారు. గోవులకు సేవ చేయడం సకల దేవతలకు పూజలు చేసిన దానితో సమానం అని పేర్కొన్నారు. స్ఫూర్తి వ్యవస్థాపకుడు సీసంగుంతల మధు, సభ్యులు గోవిందరెడ్డి, మధు, మోహన్‌రెడ్డి, భాస్కర్, నారాయణస్వామి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



వంట గదిని పరిశీలిస్తున్న అధికారులు

బేతంచెర్ల: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని మండల ప్రత్యేక అధికారి బశీరున్నిసా బేగం, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ అన్నారు. శనివారం పట్టణ సమీపంలోని కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయాన్ని సందర్శించారు. వంటగదిని పరిశీలించి, మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



హెచ్‌ఎం సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న ఎంపీపీ, ఎంఈఓ, వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: సమాజంలోని పౌరులకు విద్యా బుద్ధులు నేర్పే ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సంజీవనగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వైవీ సుబ్బారెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన్ను ఎంపీపీతో పాటు ఎంఈఓ సోమశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మిత్రులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, రామచంద్రుడు, మురళీ కృష్ణ, నాగేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎద్దులన్న పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పథకాలు వర్తింపజేయాలి



సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీలు

డోన్ టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి శివరామ్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు యశోధ, విజయలక్ష్మీ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23న కలెక్టరేట్ వద్ద ధర్నా, జూలై 9న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్లు శోభారాణి, అరుణకు సమ్మె నోటీసు అందజేశారు. కనీసం వేతనం రూ.26 వే లు ఇవ్వాలని, యాప్‌ల భారం తగ్గించాలని కోరారు.

మహాసభలను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న రామాంజనేయులు

డోన్ టౌన్: పట్టణంలో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగ నాయకులు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో జిల్లా మహాసభలకు సంబంధించి ఆహ్వాన కమిటీ ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. పలువురు మేధావులతో పాటు వివిధ రాజకీయ పార్టీ నాయకులను ఆహ్వానించి చర్చించారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, సీపీఐ నాయకులు ప్రజానాట్య మండలి, దళిత హక్కుల పోరాట సమితి, రైతు తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో ఖరీదైన వ్యవసాయం

- ఆదరణ కోల్పోయిన సంప్రదాయ వ్యవసాయ పనిముట్లు
- పల్లెల్లో కనిపించని శ్రమైక్య జీవన సౌందర్యం
- వర్షాధార భూముల్లో గిట్టుబాటు కాని వ్యవసాయం
- ఉపాధి కోల్పోతున్న చేతివృత్తిదారులు



కొలిమిపని చేస్తున్న శ్రామికుడు (ఫైల్)



డోన్ మార్కెట్‌యార్డులో వెలవెలబోతున్న వ్యవసాయ పనిముట్ల దుకాణం

డోన్: శ్రమైక్య జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదోయ్ అన్నాడు ఒక కవి. ఒకప్పుడు శ్రమైక్య జీవన సౌందర్యానికి పల్లెటూర్లు పెట్టింది పేరు. కమ్మరి, కుమ్మరి, చాకలి, మంగలి లాంటి అనేక చేతి వృత్తుల వారితో మమేకమై పల్లెజనం జీవనం కొనసాగించేవారు. వారు చేసే ప్రతి పనిలోనూ శ్రామికుల శ్రమశక్తి ఇమిడి ఉండేది. పాడిపంటలతో కళకళలాడిన పల్లెటూర్లు నేడు కళ తప్పాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

యాంత్రీకరణతో ఉపాధి కోల్పోయి

నాగరికత, యాంత్రీకరణ పెరిగిపోవడంతో పల్లెజీవనం ఛిద్రమైపోయింది. విత్తు మొదలుకుని ఎరువులు చల్లడం, కలుపు తీయడం, పంట కోయడం, దుక్కిదున్నడం లాంటివన్నీ యంత్రాలతో చేస్తుండడంతో శ్రామిక సౌందర్యం పల్లెటూర్లలో మచ్చుకకు కూడా కనిపించదు. దీంతో చేతివృత్తులపై బతుకుతున్న వేలాది మంది ఉపాధి కోల్పోయి వ్యవసాయ, దినసరి కూలీలుగా మారిపోయారు.



వ్యవసాయం మొత్తం యాంత్రీకరణ

ఒకప్పుడు కూలీలతో కళకళలాడిన పంట పొలాల్లో నేడు యంత్రాలు దర్శనమిస్తున్నాయి. కలుపు తీయడం, పంట కోయడం లాంటి పనులకు వినియోగించే కొడవళ్లు గణనీయంగా తగ్గిపోయాయి. చెట్టు కొమ్మలు, ముళ్లపొదలను తొలగించే కొడవళ్లు, గుంతలు తీసేందుకు వినియోగించే పారలు, చలికలు మచ్చుకకు కనిపించవు. దీనంతటికి కారణం వ్యవసాయం మొత్తం యాంత్రీకరణ కావడమే.

వ్యవసాయం భారం



వర్షాధారిత భూములైనందు వల్ల డోన్ నియోజకవర్గంలో వ్యవసాయం భారమైంది. చినుకు పడితే కానీ చింత తీరటట్లు లేదు. వ్యవసాయం ఈ ప్రాంతంలో గాలిలో దీపంలా మారిపోయింది. దీనికితోడు యాంత్రీకరణ పెరగడంతో కూలీల సంఖ్య క్రమేపీ తగ్గిపోతోంది. ఈ పరిస్థితుల్లో వ్యవసాయం ఖరీదైపోయి గిట్టుబాటు కావడం లేదు.

–భాస్కర్‌రెడ్డి, రైతు, మల్యాల గ్రామం, డోన్

నాటి స్మృతులు గుర్తుకువస్తే బాధేస్తుంది



వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగిపోవడం, రైతులందరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించుకునేందుకు ఆసక్తి కనబరచడంతో సేద్యం చేసే వారే కరవయ్యారు. చేతివృత్తులు మటుమాయమయ్యాయి. కూలీలకు పనులు దొరకక దూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. నాటి పల్లె వాతావరణాన్ని గుర్తుకు తెచ్చుకుంటే బాధేస్తుంది.

–గంగప్ప, సర్పంచ్, మల్లెంపల్లె, డోన్

పనిముట్లు ఆదరణ కోల్పోయాయి



ఆధునీకరణ పెరగడంతో చేతిపనిముట్లకు ఆదరణ తగ్గిపోయింది. దీంతో కత్తులు, కొడవళ్లు, గొడ్డళ్లు, పికాచీలు, పారలు, గుంటికలు, గొర్రులు, నాగలి లాంటి పనిముట్ల స్థానంలో యంత్రాలు వచ్చేశాయి. చేతిపనిముట్లు తయారు చేసే మాలాంటి వారందరూ ఉపాధి కోల్పోయారు. ప్రభుత్వాలు చేతివృత్తులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపే ప్రయత్నం చేసి ఆదుకోవాలి.

–మనోజ్, వ్యవసాయ పనిముట్ల వ్యాపారి

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం





బనగానపల్లెలో చెత్తను తొలగిస్తున్న కార్మికులు, బేతంచెర్ల: స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, కమిషనర్

బనగానపల్లె రూరల్: మండలాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి పట్టణంలోని పలు ప్రధాన రోడ్ల వెంట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. పరిసరాలు శుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని తెలిపారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా గ్రామపంచాయతీ వారు ఏర్పాటు చేసిన డస్ట్ బిన్‌లలోనే వేయాలన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం పలుచోట్ల పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను శుభ్రం చేయించారు. ఎంపీడీఓ వెంకటరమణ, డిప్యూటీ ఎంపీడీఓ సతీష్ కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ బురానుద్దీన్ పాల్గొన్నారు.

అందరూ సహకరించాలి

బేతంచెర్ల: ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రంగా ఉండాలని.. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల ప్రత్యేక అధికారి బశీరున్నిసా బేగం, తహసీల్దార్ నాగమణి, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని మానుకోవాలన్నారు. తడి,పొడి చెత్తపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య సిబ్బంది, పొదుపు మహిళలు, స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు.

పేద విద్యార్థినికి చేయూత

బేతంచెర్ల: పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సుమిత్ర చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయింది. ప్రస్తుతం మేనమామ ఇంట్లో ఉంటూ చదువుకుంటోంది. మేనమామ పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది. విద్యార్థిని పరిస్థితి తెలుసుకున్న లైఫ్ యువనేత్ర సేవా సమితి సభ్యులు అమెరికాలో ఉంటున్న రమేష్ కుమార్‌కు సమాచారం ఇచ్చారు. స్పందించిన ఆయన విద్యార్థిని స్కూల్ ఫీజుతో పాటు పుస్తకాలకు ఆర్థిక సహాయం అందజేశారు. పాఠశాల ఉపాధ్యక్షుడు మధుసూదన్, కార్యదర్శి మద్దిలేటిస్వామి, లైఫ్ యువనేత్ర సభ్యులు నాగేశ్వరరావు, మధు, అజయ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సోలార్ ప్యానల్‌తో విద్యుత్ బిల్లు ఆదా



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ మధుసూదన్ రెడ్డి

బేతంచెర్ల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డోన్ విద్యుత్ డీఈ కమలాకర్‌రావు, ఏడీ మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ పథకం ద్వారా ఇంటిపైకప్పుపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు కేంద్రం రాయితీ ఇస్తుందని తెలిపారు. విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవడంతో పాటు మిగులు విద్యుత్‌ను విక్రయించుకోవచ్చని తెలిపారు. విద్యుత్ రూరల్ ఏఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు

మహానంది: ఆలయ పరిధిలో షాపులు నిర్వహిస్తున్న వ్యాపారులు వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. శనివారం దేవస్థానం కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రేట్లకు విక్రయిస్తున్నట్లు భక్తుల నుంచి ఫిర్యాదులొస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ కప్పులు, ఫైబర్ కప్పులు వాడరాదని, గాజు గ్లాసులు మాత్రమే వాడాలన్నారు. షాపుల వద్ద డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, ధరల వివరాల బోర్డులను మూడు రోజుల్లోపు ఏర్పాటు చేయకపోతే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు.

రైల్వేలైన్ భూసేకరణకు సహకరించాలి



ఆర్‌డీఓ నరసింహులుతో మాట్లాడుతున్న రైతులు

బనగానపల్లె రూరల్: మండలంలోని జయజ్యోతి సిమెంట్ పరిశ్రమ కోసం రైల్వేలైన్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణకు రైతులు సహకరించాలని ఆర్‌డీఓ నరసింహులు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బత్తులురుపాడు, యనకండ్ల గ్రామాలకు చెందిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం ఇచ్చే ధర తమకు గిట్టుబాటు కాదని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎకరం రూ.60–80లక్షలు పలుకుతోందని పేర్కొన్నారు. గిట్టుబాటు ధర ఇస్తేను రైల్వేలైన్ ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. తహసీల్దార్ నారాయణరెడ్డి, వీఆర్‌ఓ ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

యువతను విస్మరించిన కూటమి ప్రభుత్వం



యువత పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- రేపు యువత పోరుబాట
- వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు
- విజయవంతం చేయాలని పిలుపు

డోన్: ఎన్నికల సమయంలో నిరుద్యోగులు, యువతకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది అయినా పట్టించుకోకపోవడం దారుణమని వైఎస్సార్‌సీపీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్, యువజన విభాగం నాయకులు బుగ్గన జయ చంద్రారెడ్డి, దినేష్ గౌడ్ అన్నారు. ఈ నెల 23వ తేదీ సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట యువత పోరుబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ మేరకు శనివారం పట్టణంలోని మాజీ మంత్రి బుగ్గన స్వగృహంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డితో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించారన్నారు. యువత కోసం ఏటా 5 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని.. లేదంటే తమ కాలర్ పట్టుకోవాలని నారా లోకేష్ పలు సమావేశాల్లో చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్కరికి కూడా నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, కొత్తగా ఉద్యోగాల కల్పన లేదన్నారు. కూటమి ప్రభుత్వంపై నిరుద్యోగులు పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ఈ నెల 23 తేదీ పార్టీ తలపెట్టిన కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యువత తరలిరావాలని కోరారు. పార్టీ నాయకులు చంద్ర శేఖర్‌రెడ్డి, మల్యాల శ్రీనివాసరెడ్డి, దొరపల్లె చిరంజీవి, క్వాలిటీ అబ్దుల్లా, చంద్ర, మిట్టా రవికుమారు, పూజారి వంశీ, ఎల్లీశ్వర్, వడ్డే రంగస్వామి, పండు, శేఖర్ యాదవ్, తిరుపతయ్య, పెయింటర్ వెంకటేశ్, రఫీ, రాజు, గద్దం సురేష్, కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, రైల్వే నాగేంద్ర, ప్యాపిలి నాయకులు బోరెడ్డి రఘునాథరెడ్డి, కమతం పుల్లారెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నో ఏళ్ల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు

కోవెలకుంట్ల: ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఆ సమితి జాతీయ అధ్యక్షుడు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ మున్నంగి నాగరాజు అన్నారు. శనివారం కోవెలకుంట్ల రోటరీ క్లబ్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్‌ఎఫ్, వీహెచ్‌పీఎస్, మహిళ అనుబంధ సంఘాల గ్రామ స్థాయి కమిటీల సంస్థాగత నిర్మాణం, సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణపై ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జులై 7వ తేదీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. గ్రామాల్లో మాదిగల ఆత్మగౌరవ జెండాలను ఆవిష్కరించాలని సూచించారు. సమితి జిల్లా అధ్యక్షుడు కత్తి ఓబులేసు, నాయకులు అప్పపోగు వెంకటసుబ్బయ్య, రాజు, నాగేశ్వరరావు, పెద్దమునెయ్య, విజయ్ పాల్గొన్నారు.

ఉపాధి పథకం ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

డోన్ టౌన్: ఉపాధి కూలీల కడుపు కొట్టి విందు చేసుకున్న కొలిమిగుండ్ల మండల ఉపాధి హామీ పథకం ఉద్యోగులను విధుల నుంచి తొలగించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి బాబా పక్రుద్దీన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. విధులు నిర్వహించాల్సిన సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఇచ్చిన విందుకు హాజరై మద్యం మత్తులో చిందులు వేయడం ఏంటని ప్రశ్నించారు. కూలీలను కాదని మిషన్లతో పనులు చేసి సొమ్ము చేసుకుంటున్న ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



బేతంచెర్ల ఎస్‌బీఐ వద్ద నిలిచిపోయిన నీరు

పారుతున్న నిర్లక్ష్యం..!

బేతంచెర్ల: పట్టణంలోని ప్రధాన రహదారి వెంట తరచూ పైప్‌లైన్లు పగిలిపోయి తాగునీరు వృథాగా పోతోంది. బేతంచెర్ల ప్రధాన రోడ్డులో మూడు రోజుల క్రితం పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో రహదారి వెంట చిన్నపాటి కాలువను తలపిస్తోంది. నీరు రహదారిపై పారుతుండడంతో ప్రజల నుంచి విమర్శలు వస్తాయని డ్రైనేజీ కాలువలోకి మళ్లించారు. దీనికి తోడు స్టేట్ బ్యాంక్ సమీపంలో పైప్‌లైన్ మరమ్మతు చేయడానికి తవ్విన గుంతలో నీరు నిలిచి దోమలకు ఆవాసంగా మారింది. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పైప్‌లైన్ పగిలిపోయి వృథాగా పోతున్న నీరు

గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టు షాపులు



మహిళలతో మాట్లాడుతున్న సీపీఎం నేత శ్రీకాంత్

డోన్ టౌన్: ఎక్కడ చూసినా విచ్చలవిడిగా బెల్టు షాపులు ఉండడం వల్ల కుటుంబాలు నాశనం అవుతున్నాయని.. వీటిని నివారించాల్సిన ఎక్సైజ్‌శాఖ అధికారులు, పోలీసులు మిన్నకుండిపోతున్నారని ఐద్వా నాయకురాలు షమీమ్‌బేగం, సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ అన్నారు. శనివారం పట్టణంలోని వైఎస్ నగర్‌లో జరిగిన ఐద్వా సమావేశంలో వారు మాట్లాడారు. డోన్ నియోజకవర్గంలో కూటమి నాయకుల కనుసన్నల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ సుబ్బారెడ్డి వారి అనుచరులను ప్రోత్సహించడం వల్ల ఒక్కో బెల్టు షాపుకు రూ.30–రూ.40 వేల వసూలు చేసి వీధికో బెల్టు షాపు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం వైఎస్‌నగర్ ఐద్వా నూతన శాఖ అధ్యక్షురాలిగా రమాదేవి, ఉపాధ్యక్షురాలిగా సరస్వతి, కార్యదర్శిగా మాధవి, సహాయ కార్యదర్శిగా నీలావతి, కోశాధికారిగా బీబీతో పాటు 10 మంది సభ్యులను ఎన్నుకున్నారు.





బేతంచెర్లలో యోగాసనాలు వేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, ఇతర అధికారులు, డోన్: బుగ్గన శేషారెడ్డి మార్గ్‌లో యోగాసనాలు వేస్తున్న అధికారులు, ప్రజలు

యోగాభాగ్యం

సాక్షి నెట్‌వర్క్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసికోల్లాసం కలుగుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. డోన్, బనగానపల్లె నియోజకవర్గాల వ్యాప్తంగా శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో అధికారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వక్తలు వివరించారు. డోన్‌లోని బుగ్గన శేషారెడ్డి మార్గ్‌లో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ ప్రసాద్‌గౌడ్, ఆర్డీఓ నరసింహులు, ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, ఆర్డీఓ క్రాంతికుమార్, డీఎస్పీ శ్రీనివాసులు, యోగాసన సంఘం గురూజీ రాంపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. బనగానపల్లె సివిల్ కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి ప్రతిమ, ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి, వంద పడకల ఆస్పత్రిలో సూపరింటెండెంట్ సుజాత ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలు జరిగాయి. అలాగే కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, సంజామల, అవుకు, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లో జరిగిన కార్యక్రమాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



బనగానపల్లె కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి ప్రతిమ, సిబ్బంది